క్లుప్తంగా

పరీక్ష కేంద్రం తనిఖీ



పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న పదో తరగతి పరీక్ష కేంద్రాలను మంగళవారం మండల ప్రత్యేకాధికారి సురేష్, ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఆయా పరీక్ష కేంద్రాల్లోని గదులను సందర్శించి విద్యార్థులు రాసే పరీక్ష విధానాన్ని పరిశీలించారు. వారం రోజుల పాటు జరిగిన పదో తరగతి పరీక్షలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా ముగియడంతో అధికారులు, తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

జూపల్లి సమావేశానికి తరలిన నాయకులు



వీపనగండ్ల: మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు కొల్లాపూర్ పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి మండల కేంద్రంలో పాటు వివిధ గ్రామాల నుంచి పలువురు కార్యకర్తలు తరలివెళ్లారు. బీఆర్‌ఎస్ పార్టీ నుంచి కృష్ణారావును బహిష్కరించడం అన్యాయం అని, చివరి వరకు మాజీ మంత్రికే తమ మద్దతును తెలియజేస్తామని ఈ సందర్భంగా పలువురు అన్నారు. కార్యక్రమంలో వీపనగండ్ల సర్పంచ్ నర్సింహారెడ్డి, బస్వరాజ్‌గౌడ్, శ్రీనివాసాచారి, గోపి, బాలపీరు, శాంతిరెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు జూపల్లి సమావేశానికి తరలివెళ్లారు.

రెగ్యులరైజ్ చేయాలి



అమరచింత: గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ప్రొహిబిషనరీ పిరియడ్ నాలుగేళ్లు పూర్తి అయిన సందర్భంగా తమను రెగ్యులరైజ్ చేయాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు రాజు డిమాండ్ చేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం జూనియర్ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. తమ సంఘం రాష్ట్ర, జిల్లా శాఖల పిలుపు మేరకు మండలాల్లో సమావేశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేతనాలను పెంచి తమ కు న్యాయం చేయ్యలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు రాజీక్, కరుణాకర్, శివరాణి, సౌజన్య, ప్రదీప్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ చల్లాకు సన్మానం



వీపనగండ్ల: చిన్నంబావి మండల కేంద్రంలో మంగళవారం కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామరెడ్డిని గోవర్ధనగిరిలో బీఆర్‌ఎస్ నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. గోవర్ధనగిరి గ్రామ అభివృద్ధిలో తమ వంతు సహకారాన్ని అందించాలని నాయకులు సురేశ్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, శేఖర్ చల్లాకు విజ్ఞప్తి చేశారు.

అంబలి కేంద్రం ప్రారంభం

పాన్‌గల్: పేదల దాహం తీర్చేందుకే చలివేంద్రం, అంబలి కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెల్లరాళ్లపల్లితండా సర్పంచ్ శాంతమ్మ అన్నారు. మంగళవారం తండాలో సర్పంచ్ తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తండాలో చాలా మంది గిరిజనులు పనుల నిమిత్తం వలస వెళ్లడంతో ఇంటి వద్ద ఉన్న వృద్ధులు, ఉపాధి కూలీలకు అంబలి కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొజ్జమ్మ, గ్రామ సంఘం అధ్యక్షురాలు చిట్టెమ్మ, ఐద్వా మహిళా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సాయిలీల, ఫీల్డ్ అసిస్టెంట్ సోమ్లనాయక్, పంచాయతీ కార్యదర్శి నర్మద, గిరిజనులు పాల్గొన్నారు.





పాన్‌గల్‌లో..



సంగినేనిపల్లిలో..



వనపర్తిలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో..



కొత్తకోట చౌరస్తాలో..

బడుగుల ఆశాజ్యోతి పూలే

సాక్షి, నెట్‌వర్క్: మహాత్మా జ్యోతిరాబా పూలే జయంతిని మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థల్లో పూలే చిత్రపటాలు, ప్రధాన కూడళ్లలో ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మత్స్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాత్మ జ్యోతిరావు పూలే కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. పూలే ఆశయాలను ఆచరించినప్పుడే ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్లు అన్నారు. బడుగు, బలహీన వర్గాలు అభివృద్ధి చెందితేనే ప్రజాస్వామ్యం సిద్ధించినట్లు అవుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్లు మంగమ్మ, గాయత్రి, కరుణశ్రీ, ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, తహసీల్దార్లు చాంద్‌పాషా, సింధూజ, నరేందర్, ఆర్‌ఐ భాస్కర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు రాజవర్ధన్‌రెడ్డి, సుధాకర్‌రావు, టీడీపీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అధ్యక్షుడు రాములు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాము యాదవ్, సర్పంచ్‌లు విజయలక్ష్మి, మాలాలీ, పద్మమ్మ, ఎంపీటీసీ ఇంద్రకంటి వెంకటేశ్, శ్రీదేవి, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకట్‌ప్రసాద్, ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ కాంగ్రెస్ నాయకులు సమ్మద్ మియా, కదిరె రాములు, దివాకర్‌యాదవ్, బాబా, ద్యారపోగు వెంకటేష్, బీజేపీ నాయకులు కృష్ణ, ఆర్.వెంకటేశ్వర్‌రెడ్డి, పెద్దిరాజు, బచ్చురాం, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అందెబాబు, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు భగత్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాము, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు బాలరాజుగౌడ్ పాల్గొన్నారు.



శ్రీరంగాపురంలో..



బుద్దారంలో జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



ఖిల్లాఘనపురంలో..



వనపర్తిలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో..



పెబ్బేరులో..



పెన్నంచర్లలో..



ఆత్మకూర్ తహసీల్దార్ కార్యాలయంలో..



అమరచింత మున్సిపల్ కార్యాలయంలో..



మదనాపురం తహసీల్దార్ కార్యాలయంలో..



పెద్దమందడి తహసీల్దార్ కార్యాలయంలో..



చిన్నంబావిలో..

నిబంధనల మేరకు పనులు చేయాలి

పాన్‌గల్: నిబంధనల మేరకు, రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి సురేష్ అన్నారు. మంగళవారం మండలంలోని బండపల్లి, గోప్లాపూర్ గ్రామాల్లో ఉపాధి కూలీలు సాగు నీటి కాల్వలను శుభ్రం చేశారు. పనులను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ సాగునీటి కాల్వల్లో పేరుకుపోయిన జమ్ము, మట్టి తొలగింపు పనులకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ ఆయా పనులను నిర్వహించాలన్నారు. వేసవి కాలం కారణంగా ఎండలు తీవ్రంగా ఉన్నాయని, వాటిని దృష్టిలో ఉంచుకొని ఉదయం, సాయంకాలం వేళల్లో పనులు చేయాలని సూచించారు. ఆయా గ్రామాల్లోని నర్సరీలను సందర్శించి మొక్కలను పరిశీలించారు. నర్సరీల్లో మొక్కలు ఎండకుండా రెగ్యూలర్‌గా నీరు పట్టడంతో పాటు నీడ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలో జరుగుతున్న జాతీయ ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ అఫ్జల్ మంగళవారం పరిశీలించారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో కూలీలకు ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఉపాధి హామీ పనులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పనులు వేగవంతంగా జరిగేందుకు కూలీల సంఖ్య పెంచాలని ఆదేశించారు. అదేవిధంగా హరితహారం కార్యక్రమంలో నాటిన మొక్కలను కాపాడుకునేందుకు ఉపాధి హామీల కూలీల ద్వారా నీళ్లు పోయించాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూసుకోవాలని సర్పంచ్‌లకు సూచించారు.



ఉపాధి పనులను పరిశీలిస్తున్న అధికారులు

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలం

అమరచింత: రైతులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని తెలంగాణ రైతు సంఘం జిల్లా కోశాధికారి వెంకటేష్ ఆరోపించారు. మండలంలోని పాంరెడ్డిపల్లిలో మంగళవారం ఏఐకేఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈమేరకు వెంకటేష్ మాట్లాడుతూ వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తులకు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నడంతో రైతులు ఢిల్లీలో 13 నెలల పాటు నిర్వహించిన ఆందోళనతో రైతు వ్యతిరేక నల్లా చట్టాలను వెనక్కి తీసుకుందన్నారు. హక్కుల సాధనలో ప్రాణాలు కోల్పోయిన రైతు కుటుంబాలకు ఇప్పటికీ కేంద్ర ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోకపోవడం శోచనీయమన్నారు. రైతులు పండించిన పంటలకు ప్రభుత్వాలు గిట్టుబాటు ధరలు ప్రకటించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు సైతం పంట పెట్టుబడి సాయం అందించాలని, బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మోహన్‌రాజు, శివ, అశోక్, సూరి తదితరులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న వెంకటేష్

‘భగీరథ’ పైపులైన్ లీకేజీలు పట్టించుకోరా?

- మండల సభలో ఏఈని నిలదీసిన సర్పంచ్
- అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచన

మదనాపురం: మండలంలో మిషన్ భగీరథ పైప్ లైన్లు లీకేజీ అయి నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడినా సంబంధిత అధికారులు స్పందించడం లేదని సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఎంపీపీ పద్మావతి అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమానికి సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు హాజరయ్యారు. ముందుగా అధికారులు వారి శాఖకు సంబంధించిన నివేదికను సభకు వివరించారు. అనంతరం మిషన్ భగీరథ ఏఈ శివానంద్ ప్రసంగిస్తుండగా గోవిందహళ్లి సర్పంచ్ శ్రీనివాసులు ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో మిషన్ భగీరథ పైపు లైన్ లీకేజీలు ఏర్పడ్డాయని ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోలేదని మండిపడ్డారు. వేరే వ్యక్తుల ఫోన్ నంబర్లు ఇచ్చి చేతులు దులుపుకుంటారని ఆరోపించారు. మరమ్మతు పనులు చేయడానికి వచ్చిన వారికి తమ సొంత డబ్బులు ఇస్తున్నామని సభలో వాపోయారు. దీంతో జెడ్పీటీసీ కృష్ణయ్య కలుగజేసుకొని అధికారులు ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ పని చేయాలన్నారు. ప్రజల కోసమే పని చేస్తున్నామన్న సంగతి అధికారులు మర్చిపోవద్దని సూచించారు. అనంతరం శాఖల వారీగా అభివృద్ధి పథకాల పని తీరుపై అధికారులు వివరించి పెండింగ్‌లో ఉన్న అంశాలను తెలియజేశారు. ఎంపీపీ పద్మావతి అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. టీకాలు, ప్రజలకు మెరుగైన వైద్యం, ఐకేపీలోని పథకాలపైనే ప్రత్యేకంగా మాట్లాడి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ యాదమ్మ, ఎంపీడీఓ నాగేందర్, సర్పంచ్‌లు రాంనారాయణ, కురుమూర్తి, జగన్, శారద, వాకిట బ్రహ్మమ్మ, శ్రావణి, అనిత, ఎంపీటీసీలు కురుమన్న, సరస్వతి, శారద పాల్గొన్నారు.



ఏఈ శివానంద్‌ను నిలదీస్తున్న సర్పంచ్ శ్రీనివాస్

నేడు సీపీఆర్‌పై శిక్షణ

వీపనగండ్ల: మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో బుధవారం గుండెపోటుతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని బతికించేందుకు ఉపయోగపడే సీపీఆర్‌పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మండల వైద్యాధికారి వంశీకృష్ణ తెలిపారు. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా పలువురు గుండెపోటుకు గురవుతున్న తరుణంలో ప్రథమ చికిత్సపై అవగాహన ఆవశ్యకమన్నారు. గుండెను పునరుజ్జీవం చేసే ప్రక్రియ సీపీఆర్‌తో సాధ్యమవుతుందని, ఈ విధానాన్ని గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, యువకులు, మహిళలు, అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం గుండె జబ్బుకు సంబంధించి సీపీఆర్ విధానంపై అవగాహన సదస్సు ఉంటుందని ఎంపీడీఓ ప్రసన్న కుమారి తెలిపారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, యువకులు పాల్గొని విజయంతం చేయాలని కోరారు.

ఎల్‌ఓసీ పంపిణీ

వనపర్తి: నియోజకవర్గంలోని గోపాల్‌పేట మండలం పొలికెపాడుకు చెందిన బాబుషణ్ము కికు రూ.రెండు లక్షలు, పెద్దమందడి మండ లం మనిగిల్లకు చెందిన రామకిష్టయ్యకు రూ.లక్ష, వనపర్తి మండలం చిట్యాలకు చెంది న సోమ్లాకు రూ.1.50లక్షల విలువైన సీఎం సహాయనిధి నుంచి మంజూరయిన ఎల్‌ఓసీలను మంగళవారం హైదరాబాద్‌లోని మంత్రు ల నివాస సముదాయంలో వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అబ్ధిదారులకు అందించినట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

పెబ్బేరు: మండలంలోని తోమాలపల్లిలో చెందిన గుడిసె చెన్నమ్మ కుటుంబానికి మంగళవారం ప్రజాప్రతినిధులు ఆర్థికసాయం అందజేశారు. కొంతకాలంగా గుడిసె చెన్నమ్మ కిడ్నీ సమస్యతో బాధపడుతూ మరణించారు. ఆమెకు ముగ్గురు ఆడపిల్లలు ఉండడంతో మంత్రి నిరంజన్‌రెడ్డి బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇవ్వడంతో పాటు జెడ్పీటీసీ పద్మ, ఎంపీపీ ఆవుల శైలజలు రూ. 5వేలు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వనం రాములుయాదవ్ రూ. 5వేలు, సర్పంచ్ అరుణ రూ. 5వేలు, ధర్మారెడ్డి, వీరస్వామి, కృపాకర్‌రెడ్డి, ఆనంద్, వెంకటేష్‌లు రూ.7,500లు, కాంగ్రెస్ పార్టీ యూత్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో వెంకటేష్, కురుమూర్తి, కురుమన్న, బీచుపల్లి, ఎల్లస్వామి, రాములు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న నాయకులు

‘ఉద్యమకారుల వేధించిన ఘనత జూపల్లిదే’



మాట్లాడుతున్న ఎంపీపీ, బీఆర్‌ఎస్ నాయకులు

పాన్‌గల్: గతంలో ఉద్యమకారులపై అక్రమ కేసులు బనాయించిన చరిత్ర మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావుదే అని ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌నాయక్, కొల్లాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సోమ్‌నాథ్ నాయక్, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రాము యాదవ్ మండిపడ్డారు. మంగళవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులను ఒక తాటిపైకి చేరుస్తామని జూపల్లి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం 2001లో ప్రారంభమైందని 2011 సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీలో వర్గపోరుతో తన మనుగడ కోసం జూపల్లి టీఆర్‌ఎస్ పార్టీలో చేరారని ఎద్దేవా చేశారు. అయినా పార్టీ అధికారం వచ్చిన వెంటనే ఆయనకు మంత్రి పదవిని కట్టబెట్టిందన్నారు. గతంలో కోడేరులో శ్రీకాంతాచారి విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులపై కేసులు పెట్టించి ఇబ్బందులకు గురిచేసిన ఘనత జూపల్లిది కాదా అని ప్రశ్నించారు. కేసీఆర్ దేవుడని పొగిడిన జూపల్లి ఇప్పుడు కేసీఆర్‌ను విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. పార్టీలో అనేక పదవులు అనుభవించి అధినేతను విమర్శిస్తే సస్పెండ్ చేయరా అని అన్నారు. తెలంగాణ కోసం పోరాడింది ఎవరు, ఉద్యమకారులపై కేసులు బనాయించింది ఎవరు అనేది బహిరంగ చర్చకు వస్తే నిరూపించేందుకు తాము సిద్ధం అని సవాల్ విసిరారు. సమావేశంలో సర్పంచ్‌లు వెంకటయ్యయాదవ్, విష్ణునాయుడు, అంజి, రఘుపతినాయుడు, భాస్కర్‌రెడ్డి, హన్మంతు, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీతోనే బీసీలకు న్యాయం

ఖిల్లాఘనపురం: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తేనే బీసీలకు న్యాయం జరుగుతుందని ఓబీసీ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ ఆశన్న అన్నారు. మంగళవారం మండలంలోని వెంకటాంపల్లిలో పల్లె పల్లెకు ఓబీసీ ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన బీజేపీ నాయకులతో కలిసి ఇంటింటికీ తిరుగుతు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓబీసీల కోసం చేపట్టిన పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్రమోదీ ప్రధాన మంత్రి అయిన తరువాత ఓబీసీల కోసం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించారన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం సబ్సిడీతో బీసీ కార్పొరేషన్ రుణాలు ఇవ్వడం మరిచిందన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా బీసీలను అణిచివేస్తున్నారని ఆరోపించారు. రాబోయే రోజుల్లో బీసీలంతా ఏకమై బీజేపీని అధికారంలోకి తెచ్చుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంజనేయులు, శివశంకర్, వెంకటరమణ, రాంచందర్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

